TGTEL/25/A0871

# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU








హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :26 09-08- 2026 ఆదివారం పేజీలు: 4 వెల:03/-





నిర్మల్, ఆగస్టు 7, తెలంగాణ వెన్నెల వాక్కు:
కాలానుగుణంగా వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం అవసరంగా మారింది. పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని కాపాడుతూ పంటలకు అవసరమైన పోషకాలను సమర్థవంతంగా అందించేందుకు నానో సాంకేతికత కీలకంగా మారుతోంది. ఈ క్రమంలో నానో యూరియా ప్లస్, నానో డీఏపీ వంటి ద్రవరూప ఎరువులు రైతులకు అందుబాటులోకి వచ్చాయి.

**తక్కువ పరిమాణం.. సులభమైన వినియోగం**

సాంప్రదాయ ఎరువులను పెద్ద మొత్తంలో పొలాలకు తరలించడం, నిల్వ చేయడం రైతులకు అదనపు భారంగా మారుతోంది. నానో ఎరువులు తక్కువ పరిమాణంలోనే లభించడం వల్ల రవాణా, నిల్వ, కూలీల ఖర్చులను కొంతవరకు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ద్రవరూపంలో ఉండటంతో పిచికారీ ద్వారా పంటకు అవసరమైన పోషకాలను అందించవచ్చు.

నానో ఎరువుల్లోని పోషక కణాలు సూక్ష్మ పరిమాణంలో ఉండటం వల్ల ఆకులపై పిచికారీ చేసినప్పుడు మొక్కకు పోషకాలను అందించే విధంగా రూపొందించారు. అయితే నానో ఎరువులు సాంప్రదాయ ఎరువులకు పూర్తిస్థాయి ప్రత్యామ్నాయంగా కాకుండా, పంట అవసరాలకు అనుగుణంగా సిఫారసు చేసిన విధంగా సమతుల్య ఎరువుల యాజమాన్యంలో భాగంగా ఉపయోగించడం ప్రయోజనకరం.

**సాగు ఖర్చుల తగ్గింపునకు అవకాశం**

నానో యూరియా, నానో డీఏపీ వంటి ఉత్పత్తులు తక్కువ పరిమాణంలో లభించడం వల్ల ఎరువుల రవాణా, నిల్వకు అవసరమైన స్థలం తగ్గుతుంది. రైతులు భారీ బస్తాలను పొలాలకు తరలించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది. దీంతో సాగులో శ్రమ, నిర్వహణ ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

అయితే ప్రతి పంటకు, ప్రతి దశలో అవసరమైన ఎరువుల మోతాదు భిన్నంగా ఉంటుంది. అందువల్ల నానో ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు లేదా శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

**నిర్మల్ జిల్లాలో అవగాహన కార్యక్రమాలు**

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పంటల అవసరాలకు అనుగుణంగా ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపడుతోంది. రైతు వేదికలు, రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాల ద్వారా నానో ఎరువుల వినియోగం, పిచికారీ విధానం, సరైన మోతాదుపై అవగాహన కల్పిస్తున్నారు.

రసాయన ఎరువులను అవసరానికి మించి వినియోగించకుండా, నేల ఆరోగ్యాన్ని కాపాడే సమతుల్య ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఆధునిక సాంకేతికతను సరైన పద్ధతిలో వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను నియంత్రించడంతో పాటు పంటల ఉత్పాదకతను మెరుగుపరచుకోవచ్చని చెబుతున్నారు.

నానో ఎరువులను వ్యవసాయ శాఖ సూచించిన మోతాదులో, సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని నిర్మల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి కుమార్ రైతులకు సూచిస్తున్నారు.




# సవాళ్లను అవకాశాలుగా మలచండి

**యువతకు ప్రధాని మోదీ పిలుపు**

**నిరంతరం నేర్చుకునేవారే విజేతలు.. దేశ అవసరాలకు అనుగుణంగా పనిచేయాలి**




న్యూఢిల్లీ, ఆగస్టు 8, తెలంగాణ వెన్నెల వాక్కు:
ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో సవాళ్లను చూసి వెనుకడుగు వేయకుండా వాటిని అవకాశాలుగా మలుచుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతకు పిలుపునిచ్చారు. జీవితంలో నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, కొత్త ఆలోచనలతో ముందుకు సాగేవారే విజయాన్ని సాధిస్తారని అన్నారు. శనివారం ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

జీవితంలో పరీక్షలకు సిలబస్ ఉండదు

విద్యాసంస్థల్లో జరిగే పరీక్షలకు సిలబస్ ఉంటుందని, కానీ జీవితంలో ఎదురయ్యే పరీక్షలకు ఎలాంటి సిలబస్ ఉండదని ప్రధాని అన్నారు. సమస్యలను చూసి భయపడకుండా వాటిని చిన్న చిన్న భాగాలుగా విభజించి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రపంచం ప్రశ్నించడం మానేసిన అంశాలను యువత ప్రశ్నించాలని, అయితే ప్రశ్నించడంతో ఆగకుండా పరిష్కారాలను కూడా కనుగొనాలని పిలుపునిచ్చారు.

2

# లైంగిక వేధింపుల కేసుల్లో బీజేపీ ప్రజాప్రతినిధులే టాప్: పొంగులేటి

**మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రాన్ని నిలదీసిన మంత్రి**

**"డీలిమిటేషన్ సాకు వెనుక దాక్కోవద్దు.. 33 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి"**




హైదరాబాద్ బ్యూరో:
కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మహిళల భద్రత, రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మహిళా సంక్షేమం, సాధికారత గురించి బీజేపీ నేతలు మాట్లాడుతున్నప్పటికీ, ఆచరణలో మహిళల హక్కులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

దేశవ్యాప్తంగా మహిళలపై లైంగిక వేధింపులు, ఇతర తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధుల జాబితాను పరిశీలిస్తే బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేల సంఖ్య అధికంగా ఉందని మంత్రి ఆరోపించారు. ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ ప్రజాప్రతినిధులపై బీజేపీ తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మహిళల భద్రతపై మాట్లాడే బీజేపీ, తమ పార్టీ ప్రజాప్రతినిధులపై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు.

మహిళా రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి

మహిళా రిజర్వేషన్ చట్టం అమలును నియోజకవర్గాల పునర్విభజన, జనాభా గణనతో ముడిపెట్టి కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని పొంగులేటి విమర్శించారు. డీలిమిటేషన్ పేరుతో మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే ప్రక్రియను మరింత ఆలస్యం చేయవద్దని అన్నారు.

లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. చట్టాన్ని ఆమోదించడం మాత్రమే కాకుండా, దాని ప్రయోజనాలు మహిళలకు వాస్తవంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌కు మహిళల సాధికారతే ప్రాధాన్యం

దేశంలో మహిళల పురోగతికి కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా ప్రాధాన్యం ఇచ్చిందని పొంగులేటి అన్నారు. దేశానికి తొలి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ, తొలి మహిళా రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్ వంటి నాయకత్వాన్ని కాంగ్రెస్ అందించిందని గుర్తుచేశారు. మహిళల భద్రత, రాజకీయ ప్రాతినిధ్యం, సాధికారత విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. మహిళలకు రాజకీయంగా సమాన అవకాశాలు కల్పించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్లు

**భూసేకరణ, పునరావాస సమస్యల పరిష్కారానికి నిధులు**



హైదరాబాద్ బ్యూరో:
తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూసేకరణ, పునరావాసం, పరిహారం వంటి అంశాల కారణంగా నిలిచిపోయిన పనులను ముందుకు తీసుకెళ్లేందుకు మొత్తం రూ. 5 వేల కోట్ల వరకు నిధులు కేటాయించనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఇప్పటికే రూ. 2 వేల కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో పలు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. అయితే ప్రాజెక్టులకు అవసరమైన భూములను పూర్తిస్థాయిలో సేకరించకపోవడం, భూములు కోల్పోయే కుటుంబాలకు పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియ వంటి అంశాల కారణంగా కొన్ని పనులు ఆలస్యమవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిధులు సమకూర్చడం ద్వారా ప్రాజెక్టుల పనులకు మరింత వేగం తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.

భూసేకరణకు ప్రాధాన్యం

ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయినా భూసేకరణ సమస్యలు పరిష్కారం కాకపోతే వాటి పూర్తి ప్రయోజనం రైతులకు అందే పరిస్థితి ఉండదు. దీంతో ముందుగా అవసరమైన భూముల సేకరణను పూర్తి చేయడంతో పాటు భూములు కోల్పోయిన వారికి చట్ట ప్రకారం పరిహారం అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. పునరావాసానికి సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించి పనులను నిరంతరాయంగా కొనసాగించేందుకు చర్యలు చేపట్టనుంది.

ఇప్పటికే విడుదల చేసిన రూ. 2 వేల కోట్లను అత్యవసరంగా పరిష్కరించాల్సిన భూసేకరణ, పరిహారం తదితర అవసరాలకు వినియోగించనున్నారు. మిగిలిన నిధులను అవసరాన్ని బట్టి దశలవారీగా విడుదల చేసి పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది.

రైతులకు ప్రయోజనం

సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే ఆయకట్టు పరిధిలోని రైతులకు మరింత స్థిరమైన సాగునీటి వసతి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వర్షాలపై ఆధారపడే పరిస్థితి తగ్గడంతో పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రైతులు తమకు అనుకూలమైన పంటలను సాగు చేసుకునే అవకాశం ఉంటుంది.

సాగునీటి లభ్యత పెరగడం వల్ల వ్యవసాయ ఉత్పాదకత మెరుగుపడటంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా ఇప్పటికే ఎక్కువ శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టులకు మిగిలిన అడ్డంకులను తొలగించి త్వరగా వినియోగంలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టింది.

పెండింగ్ పనులకు వేగం

ఏళ్ల తరబడి వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిధుల కొరత, భూసేకరణ వంటి కారణాలతో పనులు ఆలస్యం కాకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచాలని అధికారులను ఆదేశిస్తోంది.

ప్రాజెక్టుల పనులు పూర్తయిన తర్వాత వాటి ద్వారా అందుబాటులోకి వచ్చే నీటిని రైతులకు సమర్థవంతంగా వినియోగించేలా కాలువలు, పంపిణీ వ్యవస్థలను కూడా పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

సాగునీటి విస్తరణపై దృష్టి

రాష్ట్రంలో సాగునీటి వసతులను విస్తరించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. కొత్త ప్రాజెక్టుల కంటే ఇప్పటికే నిర్మాణం ప్రారంభమై, గణనీయంగా పూర్తయిన ప్రాజెక్టులను ముందుగా పూర్తి చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ప్రయోజనం పొందవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

## ముధోల్‌లో ఘనంగా ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి



ముధోల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రజా వీరుడు, బడుగు బలహీన వర్గాల నాయకుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను మండల కేంద్రమైన ముధోల్లోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. సాయన్న చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయక ులు మాట్లాడుతూ.. పండుగ సాయన్న 1840 ఆగస్టు 8న జన్మించి బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం తన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. పేదలకు అండగా నిలిచి వారి సంకే ్షమానికి శ్రమించిన మహనీయుడని కొని యాడారు. పేద ప్రజల రక్షణ కోసం ఆయ న చూపిన ధైర్యం, త్యాగ నిరతి భావితరాలకు ఆదర్శమని తెలిపారు. సాయన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్క ముదిరాజ్ బిడ్డ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముధోల్ మండల ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, యువకు లు, పురప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు.

## ముధోల్ సరస్వతి శిశు మందిరంలో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు




ముధోల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శనివారం బోనాల పండుగ వేడుక లను అత్యంత వైభవ ంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం పండుగ శోభతో విలసి ల్లింది. ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థినులు అమ్మవార్ల వేషధారణలతో ఆకట్టుకోగా, విద్యార్థులు పోతరాజుల వేషాలతో డప్పు చప్పుళ్లకు అనుగుణంగా విన్యాసాలు చేస్తూ అలరించారు. బ్యాండు మేళాలు, కోలా టాలు, సంప్రదాయ నృత్యాలతో విద్యా ర్థులు సందడి చేశారు.
పాఠశాల కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడానికే ఈ వేడుకలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యా యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్పంచుల సంఘం నూతన అధ్యక్షుడు ఇంద్రకరణ్ రెడ్డికి శుభాకాంక్షలు



ముధోల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా సర్పంచుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నర్సాపూర్ గ్రామ సర్పంచ్ గడ్డం ఇంద్రకరణ్ రెడ్డికి ముధోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి శనివారం ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.
ఇంద్రకరణ్ రెడ్డి సర్పంచుల సమస్యల పరిష్కారానికి, గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని విఠల్ రెడ్డి ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.
సర్పంచుల హక్కుల సాధనకు, పంచాయతీలకు నిధుల విడుదలకు నూతన కమిటీ నిరంతరం శ్రమించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సర్పంచులు ముత్త గౌడ్, ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమ మహేశ్వర్, మాజీ ఎంపీటీసీ సాయిరెడ్డి, సీనియర్ నాయకుడు గంగారెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్యారమూరు సర్పంచ్ ముందస్తు చర్యలు



ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు) :ప్యారమూరు నుండి బీరవెల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారుల సురక్షిత ప్రయాణమే ధ్యేయంగా ప్యార మూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ మకు నూరి వరలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకుని ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. రహదారి పక్కన చెట్లు విపరీతంగా పెరిగి ప్రమాదకరంగా మారిన ప్రదేశాలను పరిశీలించి చెట్లను తొలగించారు. ఈ రహ దారి పక్కన చెట్లు విపరీతంగా పెరిగి పోయి ప్రమాదకరమైన మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపిం చక నిత్యం ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండేది. ప్రయాణికుల ఇబ్బం దులను, ప్రాణాపాయ స్థితిని ముందుగానే గుర్తించిన సర్పంచ్ మకునూరి వరలక్ష్మి పంచాయతీ సిబ్బందితో తక్షణమే స్పందించారు. సర్పంచ్ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది మూలమలుపుల వద్ద రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను, కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఎదురుగా వచ్చే వాహన దారులకు రోడ్డు స్పష్టంగా కనిపించేలా ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా అడ్డంకిగా ఉన్న చెట్లను నరికివేశారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు రక్షణ చర్యలు తీసుకో వడమే నిజమైన ప్రజా నాయకత్వానికి నిదర్శనమని స్థానికులు కొనియాడారు. రహదారి స్పష్టంగా కనిపించేలా చెట్లను తొలగించడంతో వాహనదారులు, గ్రామ స్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా చర్యలు చేపట్టి న సర్పంచ్ మకునూరి వరలక్ష్మికి ప్యార మూరు, బీరవెల్లి గ్రామాల ప్రజలు, వాహ నదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పూజలు పెరిగాయి... ప్రశాంతత ఎందుకు తగ్గుతోంది?

ఆధ్యాత్మికతను ఆచారంగా కాకుండా జీవన విధానంగా మార్చుకోవాల్సిన సమయం
ఉదయం లేవగానే దేవుడి ఫొటోకు నమస్కారం.. ఇంట్లో పూజ.. ఆలయ దర్శనం.. పండుగల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు.. ఇవన్నీ మన భారతీయ జీవన విధానంలో భాగమే. కాలం మారుతున్న కొద్దీ పూజా విధానాల్లో మార్పులు వచ్చినా, భగవంతుడిపై విశ్వాసం మాత్రం కొనసాగుతూనే ఉంది. అయితే ఒక ప్రశ్న మాత్రం నేటి సమాజం ముందుంది. పూజలు పెరుగుతున్నాయి.. కానీ మనిషి మనసులో ప్రశాంతత ఎందుకు తగ్గుతోంది?
ఇది భక్తిని ప్రశ్నించే ప్రశ్న కాదు. భక్తి యొక్క అసలు అర్థాన్ని మనం ఎంతవరకు గ్రహించామనే ఆత్మపరిశీలనకు సంబంధించిన ప్రశ్న.
ఆధ్యాత్మికత అంటే దేవుడిని కోరుకోవడం మాత్రమే కాదు. మనలోని కోపం, అసూయ, ద్వేషం, స్వార్థం వంటి లక్షణాలను తగ్గించుకోవడం కూడా ఆధ్యాత్మికతలో భాగమే. దేవాలయంలో కొన్ని నిమిషాలు ప్రశాంతంగా కూర్చుని బయటకు వచ్చిన వెంటనే అదే కోపంతో, అదే అసహనంతో, అదే స్వార్థంతో జీవిస్తే మన ప్రార్థనకు, మన ప్రవర్తనకు మధ్య అంతరం ఏర్పడుతుంది.
మన పూర్వీకులు రూపొందించిన ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో ఈ అంతరాన్ని తగ్గించే ప్రయత్నం కనిపిస్తుంది. పూజలో శరీరం, మనసు, ఆలోచనలను ఒకచోట కేంద్రీకరించడం వెనుక కూడా ఒక అంతరార్థం ఉంది. దీపం వెలిగించడం అంటే చీకటిని తొలగించే వెలుగుకు ప్రతీక. పుష్పం సమర్పించడం అంటే మనసులోని మంచితనాన్ని సమర్పించుకోవడం. నమస్కారం అంటే అహంకారాన్ని తగ్గించుకోవడం. ఉపవాసం అంటే కేవలం ఆహారాన్ని మానేయడం కాదు.. మన ఇంద్రియాలపై నియంత్రణ సాధించడమనే భావన కూడా అందులో ఉంది.
అయితే కాలక్రమంలో ఆచారం మిగిలి, ఆచరణ వెనుక ఉన్న ఆలోచన కొంతవరకు మరుగునపడుతోంది. పూజలో ఉపయోగించే ప్రతి వస్తువుకు, ప్రతి సంప్రదాయానికి ఏదో ఒక తాత్విక భావం ఉన్నప్పటికీ, వాటిని కేవలం ఆచారాలుగా మాత్రమే చూసే పరిస్థితి ఏర్పడుతోంది.
ఇదే సమయంలో ఆధునిక జీవితం మనిషికి మరో సవాలు విసురుతోంది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. పనిభారం పెరిగింది. పోటీ పెరిగింది. సోషల్ మీడియా ద్వారా ప్రపంచం మన చేతిలోకి వచ్చింది. కానీ మనసుకు విశ్రాంతి ఇచ్చే సమయం తగ్గింది. మనిషి ఇతరులతో నిరంతరం అనుసంధానమై ఉన్నప్పటికీ, తనతో తాను మాట్లాడుకునే సమయం మాత్రం కోల్పోతున్నాడు.
ఈ పరిస్థితిలో ఆధ్యాత్మికతకు మరింత ప్రాధాన్యం ఉంది. దేవాలయానికి వెళ్లడం, ధార్మిక గ్రంథాలు చదవడం, భజనలు వినడం ఇవన్నీ మనసుకు ప్రశాంతతను ఇచ్చే మార్గాలుగా మారవచ్చు. కానీ వాటి అసలు ప్రయోజనం మన ప్రవర్తనలో కనిపించాలి. ఇంట్లో పెద్దలను గౌరవించడం, పిల్లలతో ప్రేమగా మాట్లాడటం, ఇతరుల కష్టాన్ని అర్థం చేసుకోవడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, ప్రకృతిని కాపాడటం వంటి చిన్న చిన్న పనుల్లోనే ఆధ్యాత్మికతకు నిజమైన పరీక్ష ఉంటుంది.
భగవద్గీత మనిషిని తన కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహించాలని బోధిస్తుంది. ఫలితంపై మాత్రమే దృష్టి పెట్టకుండా కర్తవ్యంపై దృష్టి పెట్టడం మనిషికి మానసిక స్థైర్యాన్ని ఇస్తుంది. ఈ సందేశం నేటి ఒత్తిడితో కూడిన జీవితానికి కూడా ఎంతో అవసరం.
దేవాలయాలు కూడా కేవలం దర్శన కేంద్రాలుగా కాకుండా ధార్మిక విలువలు, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించే కేంద్రాలుగా మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. అన్నదానం, విద్యా సహాయం, పేదలకు చేయూత, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు భక్తిని సేవగా మార్చగలవు.
నిజానికి దేవుడి ముందు నిలబడి మనం కోరుకునే ప్రశాంతత మన ప్రవర్తనలోనే మొదలవుతుంది. ఆలయంలో వెలిగించే దీపం మన ఇంటి గడప దాటిన తర్వాత మన హృదయంలో కూడా వెలగాలి. పూజలో పలికే మంత్రం మన మాటల్లో మంచితనంగా మారాలి. దేవుడి ముందు చేసే నమస్కారం మనిషి ముందు వినయంగా మారాలి. అప్పుడు మాత్రమే పూజ ఒక ఆచారం నుంచి ఆధ్యాత్మిక అనుభవంగా మారుతుంది. భక్తి ఒక కోరిక నుంచి బాధ్యతగా మారుతుంది. ధర్మం ఒక మాటగా కాకుండా మన జీవన విధానంగా మారుతుంది.
-- తెలంగాణ వెన్నెల వాక్కు ప్రత్యేక విశ్లేషణ

# నిరుద్యోగుల కడుపు కొట్టి... ఖజానాకు కన్నం వేసి: 'ఆధార్' కుంభకోణంపై జవాబేది?



తెలంగాణ ప్రభుత్వ శాఖల్లో ఒక్కసారిగా వెలుగుచూసిన డూప్లికేట్ ఉద్యోగుల పక్కా ప్లాన్డ్ కుట్ర రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఒక్క ఆధార్ సంఖ్యతోనే రెండు వేర్వేరు పేర్లు సృష్టించి, చివరకు లింగం, మతాల గుర్తింపును సహితం మార్చేసి ప్రభుత్వ ఖజానాను గుల్ల చేస్తూ నెలకు లక్షలాది రూపాయల జీతాలను కొల్లగొడుతుండటం సామాన్యమైన అక్రమం కానే కాదు. ఇది కేవలం ఏదో సాంకేతిక లోపం అనుకుంటే పొరపాటే, పర్యవేక్షణారాహిత్యంతో కుళ్లిపోయిన వ్యవస్థాగత కుళ్ళుకి ఇది ప్రశాంత సాక్ష్యం. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, వైద్య ఆరోగ్య, విద్యా శాఖల వంటి అత్యంత కీలకమైన ప్రజా విభాగాల్లో దాదాపు ఎనభై మంది నకిలీ రాక్షసులు ఏళ్ల తరబడి పక్కపక్కనే ఉద్యోగాలు చేస్తూ ప్రజాధనానికి పెద్ద ఎత్తున గండి కొట్టడం ప్రభుత్వ రికార్డుల నిర్వహణలోని లోతైన డొల్లతనాన్ని, కన్నుమూతల పాలనను అత్యంత స్పష్టంగా బట్టబయలు చేస్తోంది. ఖజానాపై ఈ నకిలీ ముఠా బరితెగించి పంజా విసురుతుంటే యంత్రాంగం నిద్రపోతోందా లేక లోపాయికారీగా సహకరిస్తోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నేటి ఆధునిక డిజిటల్ యుగంలో ఆధార్ సాంకేతికత అనేది దేశంలో ప్రతి పౌరుడికి అత్యంత పటిష్టమైన ప్రాథమిక బయోమెట్రిక్ ఐడెంటిటీగా నిలుస్తోంది. అటువంటి వినూత్నమైన డిజిటల్ ఐడీ ఆధారంగా ఒకే వ్యక్తి రెగ్యులర్ ఉద్యోగిగా రెండు వేర్వేరు శాఖలలో ఏకకాలంలో జీతాలు పొందుతుంటే నిద్రపోతున్న పర్యవేక్షక యంత్రాంగం ఏం చేస్తోందనేది ఇక్కడ ఉద్భవిస్తున్న మొదటి ప్రాథమిక ప్రశ్న. ప్రజారోగ్య శాఖలో డి. ప్రమీల రాణి, కె. ప్రమీల, విద్యా శాఖలో కిందింటి మోహన్ రెడ్డి , బసిరెడ్డి మోహన్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ విభాగంలో డి. లావణ్య, రమాదేవి, రెవెన్యూ,డీజీపీ కార్యాలయంలో అన్నపూర్ణ, పంచాయతీరాజ్ శాఖలో సంతోష్ కుమార్ నీలకంఠ , బీర సతీష్ రెడ్డి లాంటి పేర్లతో ఒకే ఆధార్ నంబర్‌పై రెండు ఉద్యోగాలు నిరాటంకంగా నడుస్తున్న తీరు తీవ్ర దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఒకే ఆధార్ ఆధారంగా ఒక శాఖలో పురుషుడిగా, మరో శాఖలో మహిళగా, ఒక చోట ఒక మతం పేరుతో, మరో చోట ఇంకో మతం పేరుతో నమోదు కావడం కేవలం ఒక వ్యక్తిగత మోసం మాత్రమే కానేకాదు. ఇంటర్నల్ పేరోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (×ఖీవీ×ూ) మరియు ఉద్యోగుల కేంద్ర డేటాబేస్‌ల మధ్య అనుసంధానం దారుణంగా లోపించడం వల్లనే ఈ తరహా అడ్డగోలు అక్రమాలు అప్రతిహతంగా చోటుచేసుకున్నాయి. ప్రతి సంవత్సరం ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్లు (హ=), లైవ్ వెరిఫికేషన్, బయోమెట్రిక్ హాజరు వివరాలు సరిచూడటంలో డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (ఙణూలు) బాధ్యతా రాహిత్య శిఖరాలను తాకుతూ తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శించారు. కేవలం మార్చి, ఏప్రిల్, మే నెలల మూడే మూడు నెలల వ్యవధిలోనే ఒక్కో డూప్లికేట్ ఉద్యోగి దాదాపు ఐదు లక్షల రూపాయల వరకు వేతనాన్ని ఖజానా నుండి నేరుగా అందుకున్నాడంటే, గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ వ్యవస్థీకృత ముఠా వల్ల ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టం ఏ స్థాయిలో ఉందో అంచనా వేయడం కష్టం.
ఈ దారుణ ఉదంతం అధికారుల క్రిమినల్ నిర్లక్ష్యానికి, ప్రభుత్వ స్థాయిలో కొరవడిన పర్యవేక్షణ వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణ. ప్రతి శాఖలోనూ వేల సంఖ్యలో సిబ్బంది పనిచేస్తున్నప్పుడు, డిపార్ట్‌మెంటల్ సర్వీస్ రికార్డులను నిశితంగా పరిశీలించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులపై ఉంటుంది. జీతాల బిల్లులను ఆమోదించి విడుదల చేసే నోరుమెదపని అధికారులు వివరాలను సరిచూసుకోకుండా కళ్లు మూసుకుని సంతకాలు చేయడం వల్లనే ఈ ఖజానా దోపిడీ నిరాటంకంగా సాధ్యమైంది. అంతర్గత ఉద్యోగులు, ట్రెజరీ విభాగపు సిబ్బంది లేదా డేటా ఎంట్రీ ఆపరేటర్ల ప్రమేయం, ప్రత్యక్ష సహకారం లేకుండా రెండు వేర్వేరు శాఖల్లో ఒకే సర్వీస్ హిస్టరీని లేదా ఒకే ఆధార్ ఆధారిత ప్రొఫైల్‌ను దాచడం అసాధ్యం. ఇది కేవలం కొందరు నకిలీ సిబ్బంది చేసిన తప్పు మాత్రమే కాక, అంతర్గతంగా పక్కా ప్రణాళిక ప్రకారం నడిచిన ఒక పటిష్టమైన కుట్రగా భావించాల్సి వస్తోంది. ఏ ప్రభుత్వాల హయాం నుండి ఈ దగా నిరాటంకంగా కొనసాగుతోంది, ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు రాజకీయ, పాలనాపరమైన సూత్రధారులు ఎవరు అన్న మూలాల్లోకి తొంగిచూసి నిష్పక్షపాతంగా విచారించాల్సి ఉంది.
మరోవైపు రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఒక్క ఉద్యోగ ప్రకటన కోసం, ఒక్క ప్రభుత్వ పోస్టు సాధించడం కోసం లైబ్రరీల్లో కన్నుల కారాలు చల్లుకుని పగలు రాత్రి అనక రక్తాన్ని నీరుగా మార్చి శ్రమిస్తున్నారు. ఇటువంటి దుస్థితిలో ఒకే అభ్యర్థి నకిలీ పత్రాల ఆధారంగా రెండు రెగ్యులర్ ఉద్యోగాలు పొంది, ఎలాంటి శ్రమ లేకుండా ప్రతి నెలా లక్షల రూపాయల జీతాలను కొల్లగొడుతుండటం కష్టపడే నిరుద్యోగుల కడుపుపై కొట్టడమే కాకుండా వారి భవిష్యత్తును తీవ్రంగా వెటకారం చేయడమే అవుతుంది. ప్రభుత్వ యంత్రాంగంలో శోధన ప్రక్రియ, తనిఖీల వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందో చెప్పడానికి ఈ ఘటనే ప్రత్యక్ష సాక్ష్యం. ఈ కుంభకోణం బయటపడటంతో చీఫ్ సెక్రటరీ విచారణకు ఆదేశించడం ఆహ్వానించదగిన పరిణామమే అయినప్పటికీ, ఇది కేవలం కాలయాపన విచారణలకే పరిమితమై కాలగర్భంలో కలసిపోకూడదు.
రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ, అత్యున్నత స్థాయి అధికారుల నుండి మొదలుకొని సాధారణ సిబ్బంది వరకు అందరి ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతాల బయోమెట్రిక్ ఆధారిత డేటా ఆడిటింగ్‌ను తక్షణమే పూర్తి చేయాలి. బాధ్యులైన నకిలీ ఉద్యోగులపై చట్టం ఉక్కుపాదం మోపి క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, ఇప్పటివరకు వారు అక్రమంగా పొందిన ప్రజాధనాన్ని వడ్డీతో సహా గుంజాల్సి ఉంది. ఇన్నాళ్లుగా ఈ అక్రమాలను గుర్తించకుండా ఉదాసీనంగా వ్యవహరించిన ట్రెజరీ, డ్రాయింగ్ అధికారులను విచారించి, కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అడ్డుకట్ట వేయవచ్చు.
సాంకేతికంగా 'వన్ ఎంప్లాయ్ - వన్ ఆధార్ - వన్ బ్యాంక్ అకౌంట్' విధానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆటోమేషన్ ద్వారా ఐఎఫ్ఎంఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో సెంట్రలైజ్ చేయాలి. ఒకే ఆధార్ నంబర్ వ్యవస్థలోకి మళ్లీ నమోదు కాగానే ఆటోమేటిక్‌గా అప్రమత్తం చేసేలా సాంకేతికతను తీర్చిదిద్దాలి. ప్రజాధనానికి పటిష్టమైన భద్రత కల్పించడం, పారదర్శకమైన పాలన అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. వ్యవస్థలో వేళ్లూనుకున్న ఇలాంటి చీడపురుగులను ఏరివేసి, పర్యవేక్షణా రహిత పాలనకు తెరదించినప్పుడే ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజల్లో, నిరుద్యోగ యువతలో మళ్లీ విశ్వసనీయత నిలబడుతుంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ 9848559863

# సవాళ్లను అవకాశాలుగా మలచండి

ఐఐటీ నుంచి పొందిన విద్యను కేవలం ఉద్యోగం కోసం కాకుండా దేశ నిర్మాణానికి ఉపయోగించాలని ప్రధాని సూచించారు. యువత తమ ప్రతిభను పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలు, పారిశ్రామిక రంగాల్లో వినియోగించాలని అన్నారు.
సాంకేతిక రంగాల్లో అపార అవకాశాలు
భారత్ ప్రస్తుతం అంతరిక్షం, సెమీకండక్టర్లు, డ్రోన్లు, కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్, డేటా సెంటర్లు, కీలక ఖనిజాలు వంటి అనేక కొత్త రంగాల్లో ముందుకు సాగుతోందని ప్రధాని తెలిపారు. ఒకప్పుడు పరిమితంగా ఉన్న అంతరిక్ష రంగం ఇప్పుడు యువ ఇంజినీర్లు, ప్రైవేటు సంస్థలకు కూడా అవకాశాలు కల్పిస్తోందన్నారు.
వ్యవసాయం, వైద్యం, రక్షణ వంటి రంగాల్లో డ్రోన్ సాంకేతికతకు ప్రాధాన్యం పెరుగుతోందని చెప్పారు. దేశంలో సెమీకండక్టర్ తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా సాంకేతిక స్వావలంబన సాధించవచ్చని అన్నారు. ఈ రంగాల్లో యువతకు ఉద్యోగాలతో పాటు పరిశోధన, స్టార్టప్ అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.
పరిశోధనకు ప్రాధాన్యం
దేశ భవిష్యత్తుకు పరిశోధన ఎంతో కీలకమని ప్రధాని స్పష్టం చేశారు. యువ పరిశోధకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడం ద్వారా భారత్ ప్రపంచంలో మరింత బలమైన స్థానం సంపాదించగలదన్నారు.
ఇతరులతో పోల్చుకోవద్దుయువత తమను ఇతరులతో పోల్చుకోవద్దని ప్రధాని సూచించారు. ఎవరికెంత జీతం, ఎవరికి ఎలాంటి ఉద్యోగం వచ్చిందనే విషయాల ఆధారంగా తమ విజయాన్ని అంచనా వేయకూడదన్నారు. జీవితంలో అసలు పోటీ ఇతరులతో కాదని, నిన్నటి మనతోనే అని చెప్పారు. ప్రతిరోజూ తమను తాము మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నించాలనిసూచించారు. దేశ ప్రయోజనమే లక్ష్యంగా రాబోయే దశాబ్దాల్లో భారతదేశ భవిష్యత్తును నిర్మించడంలో యువత పాత్ర అత్యంత కీలకమని ప్రధాని మోదీ అన్నారు. వ్యక్తిగత కెరీర్‌తో పాటు దేశ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణలు, స్వావలంబన రంగాల్లో యువత ముందుకు వస్తే అభివృద్ధి

## మెనూ పాటించని హాస్టల్ వార్డెన్లను విధుల నుంచి తొలగించాలి: ఎస్ఎఫ్ఐ



నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యార్థి వసతి గృహాల్లో (హాస్టళ్లలో) విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించి మెనూ పాటించని వార్డెన్లను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
జిల్లాలోని హాస్టళ్ల దుస్థితిపై జిల్లా కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా సమాచారం ఇవ్వకుండా తనిఖీలు చేస్తేనే వార్డెన్ల నిర్లక్ష్యం, నాసిరకం భోజనం పెడుతున్న విషయాలు బయటపడతాయన్నారు.
వర్షాకాలం దృష్ట్యా తాగునీరు కలుషితమవుతున్నందున హాస్టళ్లలోని ఆర్ఓ ( వాటర్ ప్లాంట్లను తక్షణమే పునరుద్ధరించి విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదన్నారు.
అధికారులు నామమాత్రపు తనిఖీలు కాకుండా చిత్తశుద్ధితో తనిఖీలు చేసి వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని దిగంబర్ కోరారు.

## ఖానాపూర్ మండలంలో ఎక్సైజ్, పోలీసుల సంయుక్త దాడులు: 13 లీటర్ల గుడుంబా సీజ్

### – 1,000 లీటర్ల నల్లబెల్లం పానకం ధ్వంసం.. ఆరుగురిపై కేసులు నమోదు



ఖానాపూర్/నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆదిలాబాద్ అసిస్టెంట్ కమిషనర్ మరియు నిర్మల్ జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఖానాపూర్ మండలంలో గుడుంబా నిర్మూలన కొరకు ఎక్సైజ్ మరియు పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విస్తృత ఆకస్మిక దాడులు నిర్వహించారు.
ఖానాపూర్ మండలంలోని కొమ్ము తండా, రంగంపేట తండా, సత్తన్‌పల్లి, గోసన్‌పల్లి, యెర్వ చింతల్, బెర్నండి, కోలంగుట్ట, సోమరిపేట, పాత ఎల్లాపూర్ గ్రామాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో గుడుంబా తయారు చేస్తున్న వారిపై 6 కేసులు నమోదు చేసి, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. 13 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.
అలాగే దాడుల సమయంలో గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 1,000 లీటర్ల నల్లబెల్లం పానకాన్ని అధికారులు అక్కడికక్కడే పారబోసి ధ్వంసం చేశారు. ఖానాపూర్ మండలాన్ని పూర్తిగా గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. నల్లబెల్లం అక్రమ రవాణా, నాటుసారా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్, ఎస్ఐలు వసంతరావు, సింధు పాల్గొన్నారు.

## నిర్మల్ బంగాల్‌పేట్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగాల్‌పేట్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బడుగు బలహీనవర్గాల నాయకుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు పాతర్ల హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిసి, ఎస్సి, ఎస్టి జెఏసి రాష్ట్ర నాయకులు రామగిరి రవీందర్, కల్లూరు సుధాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి సేవలను స్మరించుకున్నారు. పెత్తందారీ వ్యవస్థను ఎదిరించి పేదలకు అండగా నిలిచిన ప్రజా వీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు.
నిర్మల్ జిల్లా కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బహుజన వర్గాల హక్కుల సాధనకు పండుగ సాయన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో సంఘం పెద్దలు పాతర్ల రాజు, పందెన రాందాస్, పాతర్ల నరేష్, పెదగొండ శేఖన్న, గంగాధర్, సుంకరి పోతన, సోప్పరి రమేష్, పాతర్ల వంశీ, పందిన గంగరాజు, ఏపూరి పవన్, పాతర్ల వెంకటి, మందుల పోశెట్టి పాల్గొన్నారు.




## ముధోల్ అక్షర పాఠశాలలో కన్నుల పండువగా బోనాల సంబరాలు




ముధోల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలోని అక్షర పాఠశాలలో శనివారం బోనాల సంబరాలు కన్నుల పండువగా సాగాయి. పాఠశాల డైరెక్టర్ సుభాష్ అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ వేడుకలను ఘనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని పేర్కొంటూ, విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరంగా వివరించారు. మన ఆచార వ్యవహారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ధరించిన పోతురాజులు, శివసత్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థినులు నైవేద్యాల బోనాలతో, జానపద పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ అత్యంత ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాయికుమార్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన అల్లోల



లక్ష్మణ్‌చందా/నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి లక్ష్మణ్‌చందా మండల పరిధి లో శనివారం పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని, ఇటీవల కుటుం బ సభ్యులను కోల్పో యిన బాధిత కుటుంబాలను పరామర్శించారు.రాచపూర్ సర్పంచ్ బూసి మహేష్, పీచర గ్రామానికి చెందిన మల్లెల నర్సయ్య, తిప్పని రాజేశ్వర్లను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అమెరికాలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన నర్సాపూర్ విద్యార్థి నిత్యానంద కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన విలేకరి మచ్చేందర్ తండ్రి, నిర్మల్ మండలం ఎల్లపెల్లికి చెందిన మోహన్ తండ్రి రామన్ భూమన్న, సోన్ మండలం వెల్మల్ గ్రామానికి చెందిన కుందానం శివ తండ్రి పోశెట్టి, వెంకటాద్రిపేట్ మాజీ కౌన్సిలర్ కూన రాజేశ్వర్ సోదరుడు మృతి చెందిన విషయం తెలుసుకుని వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్ర మంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా సర్పంచుల సంఘం ప్రత్యేక సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌదాని భూమన్న యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా సర్పంచుల సంఘం నూతన అధ్యక్షుడిగా గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా జక్కుల గజేందర్, ప్రధాన కార్యదర్శిగా కదం భుజంగరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జక్కుల నవీన్ యాదవ్, వర్నాల వెంకట్, శిరం సుష్మా రెడ్డి, కూనేరు భూమన్న, పెంట దశరథ్‌లను ఎన్నుకున్నారు. అలాగే సంఘం కార్యదర్శులుగా లలిత రాజేష్, చిట్యాల లక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా ఎంపల్లి నాగలక్ష్మి ఎన్నికయ్యారు. గ్రామ పంచా య తీల అభివృద్ధికి నిధుల సాధన, సర్పం చు లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని నిర్ణయించారు.
నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు రాష్ట్ర సర్పంచుల సంఘం నేతలు, జిల్లా సర్పంచులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## ప్రాజెక్టుల నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తాం: కలెక్టర్ భవేశ్ మిశ్రా

### – ఎల్ నినో ప్రభావం దృష్ట్యా రైతులు ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని విజ్ఞప్తి



నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని రాబోయే భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రాజెక్టుల నీటిమట్టం, సాగునీటి లభ్యత, పంటల సాగు విధానాలపై నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**20 శాతం వర్షపాతం లోటు నమోదు:**
జిల్లాలో ఇప్పటివరకు సగటున అవసరమైన వర్షపాతం నమోదైనప్పటికీ కొన్ని మండలాల్లో సుమారు 20 శాతం మేర వర్షపాతం లోటు ఉందన్నారు. రానున్న రోజుల్లో 'ఎల్ నినో' ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉన్నందున ముందస్తు కార్యాచరణతో సాగునీటి నిర్వహణ చేపడుతున్నామన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో 35 వేల ఎకరాలకు, కడెం ప్రాజెక్టు ద్వారా 6 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు.

**కంది సాగు విస్తీర్ణం 10 వేల ఎకరాలకు పెంపు:**
గ్రామసభల ద్వారా క్షేత్రస్థాయి నీటి లభ్యత పరిస్థితులను రైతులకు వివరించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇంకా స్వల్పకాలిక పంటలు విత్తుకునే సమయం ఉన్నందున రైతులు వరికి ప్రత్యామ్నాయంగా కంది వంటి ఆరుతడి పంటలను సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. కంది సాగు వల్ల రైతులకు అధిక లాభాలు వస్తాయన్నారు. ఈ ఏడాది జిల్లాలో కంది సాగు విస్తీర్ణాన్ని 6 వేల ఎకరాల నుండి 10 వేల ఎకరాలకు పెంచినట్లు వివరించారు.

**తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యం:**
వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జల మట్టాలు తగ్గి బోరు బావులపై ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. పంట మార్పిడి విధానాలను అనుసరించడం వల్ల నీటి వినియోగం తగ్గడమే కాకుండా భూసారం పెరిగి రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు కొరకు 2,500 ఎకరాలకు సంబంధించి రైతులు డిడిలు సమర్పించారన్నారు.

**3 వేల ఫామ్ పాండ్ల నిర్మాణానికి రైతులు సిద్ధం:**
తెలంగాణ జలసిరి పథకం కింద భూగర్భ జలాల పెంపుదల లక్ష్యంగా ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని విశేషంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ ఏడాది జిల్లాలో 2,026 ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 3,000 వరకు నిర్మాణాలు చేపట్టడానికి రైతులు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. చెరువులు, కుంటల్లో నీటి నిల్వలను పొదుపుగా వాడుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.
అంతకుముందు నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశంలో ప్రాజెక్టుల నీటిమట్టం, కాలువల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ రాజేంద్ర ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఇతర అధికారులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## బాసర ఆర్‌జీయూకేటీలో హాండ్‌బుక్ ఆవిష్కరించిన విసి ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటి బాసర) ప్రాంగణంలో విద్యాపాలన, నైతిక నాయకత్వం, పరిశోధనా రంగాల బలోపేతానికి రూపొందించిన 'హాండ్‌బుక్ ఫర్ హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్' మార్గదర్శక గ్రంథాన్ని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ శనివారం ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో విసి గోవర్ధన్ స్వయంగా రచించిన ఈ గ్రంథాన్ని ఓఎస్డీ ప్రొఫెసర్ ఇ. మురళీ దర్శన్‌తో కలిసి విడుదల చేశారు. ఇందులో అకాడమిక్ విజన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, పరిశోధనలు, ఆర్థిక నిర్వహణ వంటి 20 కీలక అధ్యాయాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా విసి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఈ గ్రంథం వర్సిటీలోని ఇంజనీరింగ్, సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగాలు అన్నింటిలో ఒకే విధమైన ఉన్నత ప్రమాణాలను నెలకొల్పేందుకు అకాడమిక్ దిక్సూచిలా ఉపయోగపడుతుందన్నారు. సాంకేతిక ఆవిష్కరణల్లో వర్సిటీని అగ్రగామిగా నిలబెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అసోసియేట్ డీన్లు, వివిధ విభాగాల అధిపతులు (హెచ్ఓడీలు), అధ్యాపకులు, ఇతర ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బాబాపూర్ చెరువు నీటి నిల్వలను పరిశీలించిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

లక్ష్మణ్‌చందా/నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రైతుల పంటల అవసరాలను, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా నీటి వినియోగం చేపట్టాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం ఆయన లక్ష్మణ్‌చందా మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఉన్న చెరువును ఆకస్మికంగా సందర్శించి నీటి నిల్వలను పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చెరువులోని ప్రస్తుత నీటి మట్టం, గ్రామంలోని వ్యవసాయ సాగు నీటి అవసరాలను బేరీజు వేసుకుని కాలువలకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి నీరు అందేలా చూస్తూ, నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.
అనంతరం చెరువు తూము పరిస్థితిని, కట్ట దృఢత్వాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. చెరువు కింద సాగవుతున్న పంటల రకాలు, మొత్తం ఆయకట్టు విస్తీర్ణం వివరాలను అక్కడ ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు.
ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన అధికారి రమణ, మండల స్థాయి అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# హరిహర క్షేత్రంలో దొంగతనం..

## నిందితులను కఠినంగా శిక్షించాలి: అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

- క్షేత్రంలో చోరీకి గురైన బంగారం, వెండి ఆభరణాలను తక్షణమే రికవరీ చేయాలని పోలీసులకు విజ్ఞప్తి
- ఆలయ పరిసరాలను పరిశీలించిన మాజీ మంత్రి.. భక్తుల మనోభావాలు కాపాడాలని డిమాండ్



నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీ హరిహర క్షేత్రం ఆలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి భారీ దొంగతనానికి పాల్పడం తీవ్ర కలకలం రేపింది. ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ద్వారాల తలుపులు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు స్వామివారి శేష వస్త్రాలు, విలువైన బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఆలయ నిర్వాహకుల సమాచారం మేరకు సుమారు 10 కిలోల వెండి, 2 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. శ్రీ హరిహర క్షేత్రంలో దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శనివారం ఆలయాన్ని సందర్శించారు. చోరీ జరిగిన తీరును, దుండగులు ధ్వంసం చేసిన ఆలయ తలుపులు, తాళాలను ఆయన క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించారు. ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, స్థానిక పోలీసు అధికారులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆధ్యాత్మిక కేంద్రంలో ఇలాంటి అక్రమాలు జరగడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలోనే అత్యంత పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రమైన హరిహర ఆలయంలో దొంగతనం జరగడం అత్యంత విచారకరమన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం తక్షణమే ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని సిసిటివి ఫుటేజీలను పకడ్బందీగా పరిశీలించి నిందితులను త్వరగా గుర్తించి అరెస్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయంలో నిత్యం పూజలు అందుకునే దేవుళ్ల ఆభరణాలు చోరీ కావడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందన్నారు. బాధ్యులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చోరీకి గురైన మొత్తం బంగారం, వెండి ఆభరణాలను త్వరితగతిన రికవరీ చేసి ఆలయ యాజమాన్యానికి అప్పగించేలా పోలీసులు రాత్రింబవళ్లు శ్రమించాలన్నారు. జిల్లాలోని ప్రధాన ఆలయాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని, రాత్రి వేళల్లో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని అధికారులకు సూచించారు. ఆధ్యాత్మిక ప్రదేశాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు, స్థానికులు ఆందోళన చెందకుండా పోలీసులు వేగంగా నిందితులను పట్టుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అల్లోల మురళీధర రెడ్డి, అల్లోల సురేందర్ రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, పాక్స్ చైర్మన్లు పివి రమణ రెడ్డి, కృష్ణ ప్రసాద్ రెడ్డి, మాజీ చైర్మన్ ఆమెడా శ్రీధర్, నిర్మల్ మండల కన్వీనర్ మలేష్, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు వినోద్, లింగన్న, పోశెట్టి, గంగాధర్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ ప్రభుత్వ కళాశాల విద్యార్థి గుగ్లావత్ శేఖర్‌కు సీపీగెట్‌లో రాష్ట్రస్థాయి 5వ ర్యాంక్



నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బిఎస్సీ (ఎమ్‌పిసి) విద్యార్థి గుగ్లావత్ శేఖర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన సీపీగెట్ (కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్) ఫలితాల్లో రసాయన శాస్త్రం (కెమిస్ట్రీ) విభాగంలో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ శేఖర్‌ను ప్రత్యేకంగా అభినందిం చారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుపేద విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. రైతు కుటుంబంలో జన్మించిన శేఖర్, తండ్రి లింబాజీ ప్రోత్సాహంతో నిర్మల్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ పట్టుదలతో విద్యాభ్యాసం కొనసాగించారని తెలిపారు.

కష్టపడి చదవడం, క్రమశిక్షణ, నిబద్ధతతో ముందుకు సాగితే ఎలాంటి ఉన్నత లక్ష్యాన్నైనా సాధించవచ్చని శేఖర్ తన ప్రతిభతో నిరూపించారని ప్రిన్సిపాల్ కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నత పరిశోధనలు చేసి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. శేఖర్ సాధించిన ఈ విజయంపై కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు అర్చన, డాక్టర్ సూర్యా సాగర్, రమేశ్ రెడ్డిలతో పాటు ఇతర అధ్యాపక, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# నిర్మల్ గాజులపేట్‌లో విజయవంతంగా 30 కోతుల పట్టివేత



నిర్మల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని 35వ వార్డు గాజులపేట్ ప్రాంతంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పర్యవేక్షణలో స్పెషల్ టీమ్ ద్వారా 30 కోతులను పట్టుకున్నారు. పట్టుబడిన కోతులకు గుర్తింపు రంగులు చల్లి, అటవీ శాఖ అధికారుల సహకారంతో కవ్వాల్ దట్టమైన అటవీ ప్రాంతానికి సురక్షితంగా తరలించారు. కోతుల బెడద వల్ల గాజులపేట్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నివారించేందుకు మున్సిపాలిటీ ఈ చర్యలు చేపట్టింది. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోతుల సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు అన్ని వార్డుల్లో నిరంతరం ఈ కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు వెల్లడిం చారు. కాలనీ వాసులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నూజహాత్ పర్వీన్ (జాకీర్), శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, కాలనీ వాసులు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 10న ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఆర్‌టీసీ టీఎమ్‌యూ జిల్లా స్థాయి సమావేశం



నిర్మల్/ఆదిలాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్‌టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎమ్‌యూ) జిల్లా స్థాయి సమావేశాన్ని ఈ నెల 10వ తేదీ సోమవారం నాడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆదిలాబాద్ రీజినల్ కార్యదర్శి ఆర్. గంగాధర్ తెలిపారు. ఆ రోజున ఆదిలాబాద్‌లో టీఎమ్‌యూ నూతన యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించి, పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆర్‌టీసీ కార్మికుల సంక్షేమం మరియు యూనియన్ ఎన్నికల నిర్వహణపై జిల్లా స్థాయి సమావేశం జరగనుందని వెల్లడించారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ఉట్నూర్, మంచిర్యాల, నిర్మల్, భైంసా డిపోలకు చెందిన టీఎమ్‌యూ కార్యకర్తలు, యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల సాధనకు, ఆర్‌టీసీ పరిరక్షణకు టీఎమ్‌యూ నిరంతరం శ్రమిస్తుందని, ఈ సమావేశంలో ఆర్‌టీసీ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా చర్చిస్తామని గంగాధర్ వివరించారు.

# ఆగస్టు 15 తర్వాత వర్షపాతం తగ్గే అవకాశం: దిలావర్‌పూర్ మండలంలో గ్రామసభలు




దిలావర్‌పూర్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): సూపర్ ఎల్నినో ప్రభావంతో ఆగస్టు 15 తారీకు తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం తక్కువగా ఉందని వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించిన నేపథ్యంలో దిలావర్‌పూర్ మండలంలో శనివారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల మరియు పంచాయతీరాజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సభలు జరిగాయి.

దిలావర్‌పూర్, మాడేగాం, మాయాపూర్, సిర్గాపూర్, బన్సపల్లి, కాల్వ మరియు కాల్వ తాండాలలో ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. రైతులు నీటి వనరులు పుష్కలంగా ఉంటేనే వరి సాగు చేయాలని, లేనిపక్షంలో తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను ప్రత్యామ్నాయంగా విత్తుకోవాలని అధికారులు సూచించారు.

ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే లాభాలను వివరిస్తూ సాగు విస్తీర్ణాన్ని రెట్టింపు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 13 నుండి ప్రారంభించనున్న 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్' యాప్ ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మాయాపూర్ గ్రామంలో కళాజాతర బృందం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

# సారంగాపూర్ మండల కేంద్రంలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



సారంగాపూర్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బిసి, ఎస్సి, ఎస్టి జెఎసి జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న ముదిరాజ్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కునేరు భూమన్న చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. పేదలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసి భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థను ధైర్యంగా ఎదిరించిన యోధుడు పండుగ సాయన్న అని నాయకులు కొనియాడారు.

పండుగ సాయన్న త్యాగాలు, ప్రజాసేవ భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా రాబోయే రోజుల్లో మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం పండుగ సాయన్న సేవలను అధికారికంగా మరింత గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, కల్లూరు సుధాకర్, ముదిరాజ్ సంఘం నాయకులు సైదు చందు, పాతల గంగాధర్, దొడ నరసయ్య, సైదు నారాయణ, నరేష్, రమేష్, కన్నెం శేఖర్, దినేష్, భోజన్న, వార్డు సభ్యులు సంతోష్, సందీప్ పాల్గొన్నారు.

# ముధోల్ ఎడ్బిడ్ ఫ్యూచర్ పాఠశాలలో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు





ముధోల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండలం ఎడ్బిడ్ గ్రామంలోని ఫ్యూచర్ పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పండుగ వేడుకలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పోతరాజులు, శివసత్తుల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

విద్యార్థినులు నైవేద్యాలతో కూడిన బోనాలను నెత్తిన ఎత్తుకుని, పోతరాజుల విన్యాసాల నడుమ బోనాల పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పాఠశాల ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది.

పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల భక్తి, సంస్కృతి, ఐక్యతకు బోనాల పండుగ ప్రతీక అని తెలిపారు. మన ఆచార వ్యవహారాల విశిష్టతను చిన్నారులకు తెలియజేయ డానికే ప్రతి సంవత్సరం పాఠశాలలో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నా మన్నారు.

ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది మరియు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని శోభాయమానంగా ముగించారు.

# కుబీర్ శ్రీ హనుమాన్ మందిర నిర్మాణ టెండర్ కాపీని అందజేసిన విఠల్ రెడ్డి



కుబీర్/ముధోల్, ఆగస్టు 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): కుబీర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ హనుమాన్ మందిరం నిర్మాణానికి సంబంధించిన అధికారిక టెండర్ అప్రూవల్ ప్రత్రాన్ని ముధోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి శనివారం స్థానిక గ్రామ సర్పంచ్ మరియు గ్రామ పెద్దలకు అందజేశారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి టెండర్ ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు విఠల్ రెడ్డి మరియు కుబీర్ గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఆలయ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని గ్రామస్తులు తెలిపారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కుబీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాణ్, గ్రామ సర్పంచ్ సాయినాథ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ విజయ్, సూది రాజన్న, సంతోష్, నారది మల్లేష్, పెంటాజి, జావీద్, నాగలింగం పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com